ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- రేచర్ల గ్రామంలో 125వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి మండలం, రేచర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన 125వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి అక్కచెల్లెమ్మలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న లబ్ధిపై అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, రైతు భరోసా, సున్నావడ్డీ, అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుక పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. తొలుత గడపగడపకు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఎలీజాకు గ్రామంలోని మహిళలు, యువకులు, వృద్ధులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. వివిధ సమస్యలపై గ్రామస్తులు ఇచ్చిన అర్జీలు, వినతులను ఆయన స్వీకరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, సర్పంచ్ కె.శివరామకృష్ణ, ఉప సర్పంచ్ బాలకృష్ణ, పార్టీ నాయకులు తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, మాగంటి లక్ష్మణ్‌దాస్, నరుకుళ్ళ సుబ్బారావు, గుత్తా మాధవరావు, పెనుగొండ శివరామకృష్ణ, కాన్వెంట్ రాజు, అడపా సురేష్, సీహెచ్ జ్ఞానారెడ్డి, అలవాల బాబు, యర్ల మోహన్‌రావు, ఎం.ఇమ్మానియేలు, ఎం.దిలీప్, శ్రీరాముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీబీఆర్ ట్రోఫీ విజేతలకు బహుమతుల అందజేత


దుద్దుకూరులో క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో జనవరి 23 నుంచి 25వ తేది వరకూ నిర్వహించిన ఆటల పోటీల్లో గెలిపొందిన విజేతలకు ఆదివారం దుద్దుకూరులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ ఆటల పోటీలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లాపరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. జనవరి 26న బహుమతి ప్రదానోత్సవం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్ర అస్వస్థకు గురికావడంతో ఈ కార్యక్రమాన్ని టీబీఆర్ కమిటీ వారు వాయిదా వేశారు. రసవత్తరంగా జరిగిన ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఆదివారం పిలిపించి బాలరాజు చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానంలో గెలిచిన కుమ్మరికుంట, మంచులవారిగూడె టీమ్‌కు రూ. 25,000, రెండో స్థానం సాధించిన బెడదనూరు (ఏ) టీమ్‌కు రూ. 15,000, మూడో స్థానంలో నిలిచిన గుంజవరం టీమ్‌కు రూ.10,000, నాల్గవ స్థానం దొరమామిడి టీమ్‌కు రూ.5,000 చొప్పున నగదు బహుమతులను ఎమ్మెల్యే బాలరాజు అందజేశారు. అదేవిధంగా కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన కోయనాగంపాలెం టీమ్‌కు రూ. 25,000, రెండో స్థానంలో గెలిచిన చింతలగూడెం టీమ్‌కు రూ.15,000, మూడో స్థానం సాధించిన కుక్కునూరు టీమ్‌కు రూ. 10,000, నాల్గో స్థానంలో నిలిచిన చింతలగూడెం (బి) టీమ్‌కు రూ. 5,000 చొప్పున నగదు బహుమతులు అందించారు. విలువిద్య, నాటు బాణం పోటీల్లో మొదటి స్థానంతో గెలుపొందిన వీరమద్దిగూడెంకు చెందిన తమ్మిరెడ్డికి రూ. 5000, రెండో స్థానంలో గెలిచిన రాచూరు కొమరం చల్లయ్యకు రూ. 3000, మూడో స్థానంలో గెలిచిన అలివేరు ప్రకాశ్‌రెడ్డికి రూ. 2000 చొప్పున నగదు బహుమతులు అందించారు. ఆధునిక బాణం పోటీల్లో మొదటి స్థానంలో గెలిచిన పాలకుంట కూరం పెంటారావుకు రూ. 5000, రెండో స్థానంలో గెలిచిన మద్దికట్లకు చెందిన బోడెం వెంకటేశ్‌కు రూ.3000, మూడో స్థానం సాధించిన ఉర్రింకకు చెందిన ఉదయ్ కిరణ్‌కు రూ. 2,000 చొప్పున నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీ రావు, ఆరేటి సత్యనారాయణ, ఎంపీపీ కారం శాంతి రమణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, మండల సచివాలయాల కన్వీనర్ తెల్లం సింహాచలం, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు కుంజా వెంకటేశ్వరరావు, నాయకులు కారం వెంకట రమణ, యాండ్ర రవి, ఎస్సై చంద్రశేఖర్, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 450 కేజీల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ డీటీ కుంచా సుధాకర్ స్థానిక రామచంద్ర కళాశాల సమీపంలో తనిఖీలు నిర్వహించగా, అద్దాల ఆదినారాయణ, మరో వ్యక్తి ట్రక్కు ఆటోలో 10 ప్లాస్టిక్ సంచుల్లో 450 కేజీల బియ్యాన్ని రవాణా చేస్తూ పట్టుబడ్డారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని ట్రక్కు ఆటోను, పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి సుధాకర్ ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేటినుంచి విలువిద్యలో శిక్షణ తరగతులు

జంగారెడ్డిగూడెం : ఓల్గా ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్చరీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ మే 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ కోచ్ ఎల్.జయరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ, కలెక్టర్ ఆదేశాల మేరకు యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా వారిలో నైపుణ్యతను వెలికితీసే విధంగా వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోచింగ్ క్యాంప్‌లో శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు 2 ఆధార్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని జంగారెడ్డిగూడెంలోని అయ్యప్ప టౌన్‌షిప్ 7వ రోడ్‌లో ఉన్న ఓల్గా ఆర్చరీ అకాడమీలో పేర్లు నమోదుచేయించుకోవాలన్నారు. తరగతులు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జరుగుతాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మన్‌కీ బాత్

పోలవరం రూరల్ : మన్ కీ బాత్ 100వ శీర్షికను పోలవరంలో అన్ని గ్రామాలలో టీవీలలో వీక్షించడం జరిగిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేపీ మండల అధ్యక్షుడు కామిశెట్టి నాగరాజు, మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ కరిబండి నాగరాజు తెలిపారు. గ్రామాలలో బీజేపీ శ్రేణులు స్థానిక ప్రజలను కలుపుకొని ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో మైలవరం ఎమ్మెల్యే


మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు శ్రీవారి మొమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదివారం రాత్రి సందర్శించారు. ముందుగా ఆయన సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ప్రధానార్చకులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాధాచార్యులు చినవెంకన్న మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

ప్రశాంతంగా ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్ష

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్షలను ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకలవ్య మోడల్ స్కూల్‌లో 6వ తరగతి, 7వ తరగతి, 8వ తరగతుల్లో ప్రవేశానికి సంబంధించి ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 393 సీట్లు భర్తీ చేయాల్సి ఉండగా 298 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు హాజరైనట్లు ఆయన చెప్పారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోండి


వరి రైతులకు సూచనలు చేస్తున్న ఏవో పోశారావు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పంట పొలాలను, రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మండల వ్యవసాయాధికారి పోశారావు ఆదివారం పరిశీలించారు. మరో 4 రోజుల పాటు వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు తమ వద్ద ఉన్న ధాన్యంపై బరకాలతో కప్పి తడవకుండా జాగ్రత్త తీసుకోవాలని రైతులకు సూచించారు. మండలంలో 6,300 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 1050 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, ఇప్పటివరకు 350 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు.

సత్యదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

లింగపాలెం : రాష్ట్రంలోనే రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన రంగాపురం గ్రామంలో వేంచేసిన శ్రీసత్యన్నారాయణస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ భూదేవీ, నీళాదేవీ సమేత సత్యన్నారాయణస్వామిని, వెంకటేశ్వరస్వామిని వధూవరులుగా ఆలయ ప్రధానార్చకులు శేషాచార్యులు, గుమస్తా గోపి అలంకరించి పూజలు నిర్వహించారు.

దొరమామిడిలో జాతర ప్రారంభం

బుట్టాయగూడెం: దొరమామిడిలో గంగానమ్మ, ముత్యాలమ్మ, మాయాలమ్మ, పోతురాజు జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. సుమారు 15 రోజులపాటు జాతర మహోత్సవాలను నిర్వహిస్తామని గ్రామస్తులు కాలింగి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. కళాకారులు వివిధ వేషధారణలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపు జరిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.

శోభాయాత్ర కరపత్రాల విడుదల

కొయ్యలగూడెం : ఈనెల 14న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 14న మధ్యాహ్నం 3 గంటలకు కొయ్యలగూడెం నుంచి ప్రారంభించి గురవాయిగూడెం ప్రముఖ పుణ్యక్షేత్రం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి, అక్కడ నుంచి జంగారెడ్డిగూడెం ఇందిరా కాలనీ కొత్తపేట అభయాంజనేయ స్వామి ఆలయం వరకు 18 కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలో యువత, ధార్మిక సంస్థల సభ్యులు పాల్గొనాలని కోరారు.

రైతు కూలీ సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

పోలవరం రూరల్ : ఏలూరు షాదీఖానాలో ఈనెల 2వ తేదీన జరిగే రైతు కూలీ సంఘం (ఆంధ్ర) ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌కే బాజీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రపంచీకరణ–ప్రైవేటీకరణ–సరళీకరణ విధానాలు, వ్యవసాయ రంగ సమస్యలు, పోలవరం ప్రాజెక్టు, ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, రైతుకూలీ సంఘం ఆంధ్ర ప్రదేశ్ రైతాంగ సమస్యల పైన, కూలీల సమస్యల పైన, ఆదివాసీ ప్రాంతాల్లో 1/ 70 చట్టాన్ని, 40/ 96 పిసా చట్టం అమలు తదితర విషయాలపై చర్చిస్తామన్నారు. జిల్లా నాయకులు కుంజం రామారావు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ మహాసభకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి ఝాన్సీ, కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, సహాయ కార్యదర్శి డి.వర్మ, కార్యవర్గ సభ్యులు యు వీరబాబు, ఎస్‌కే భాష పాల్గొంటారన్నారు. ఈ మహాసభను ప్రజలు, రైతు కూలీలు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధికి నోచుకోనున్న కంకర కోనేరు చెరువు

- త్వరలో వాకర్స్ ట్రాక్ నిర్మాణంతోపాటు చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు
- సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి చేపటనున్న రోటరీ


కొయ్యలగూడెంలోని కంకర కోనేరు చెరువు

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ కొయ్యలగూడెం శాఖ ద్వారా కంకర కోనేరు చెరువు (రజకుల చెరువు) అభివృద్ధికి నోచుకోనుంది. కోనేరు చెరువు చుట్టూ వాకర్స్ ట్రాక్ నిర్మాణం తో పాటు తూర్పు వైపు చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణానికి క్లబ్ సంకల్పించింది. దీనికిగాను రూ.25 లక్షలు రోటరీ క్లబ్ ద్వారా మరో రూ.25 లక్షల అంచనాతో ఎంపీ, ఎమ్మెల్యే నిధులను వినియోగించి దాదాపు రూ.50 లక్షలతో అభివృద్ధి చేపట్టనుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనుల భూమి పూజ ప్రారంభించడానికి మే నెల మొదటి వారంలో రోటరీ క్లబ్ గవర్నర్ విచ్చేయనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, శంకు కొండ పేర్కొన్నారు. వందల సంవత్సరాల నేపథ్యం ఉన్న కంకర కోనేరు ప్రస్తుతం రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనిని నాలుగు వైపులా క్రమబద్ధీకరించి నాలుగు దిశలలోను వాకర్స్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. తూర్పు వైపున చెరువులో అర ఎకరం విస్తీర్ణంలో ప్రదేశాన్ని మట్టితో పూడ్చి చిల్డ్రన్స్ పార్క్‌ను క్రీడా పరికరాలతో నిర్మిస్తామని అన్నారు. చెరువు మధ్యలో కృష్ణ భగవానుని విగ్రహాన్ని చుట్టూ స్వచ్ఛమైన నీటిని నింపి సుందర సరస్సుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. దీనికోసం ప్రత్యేకంగా వాటర్ బోరు వేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రజకులకు న్యాయం జరిగే విధంగా ఇప్పటివరకు ఉన్న ఇళ్లను తొలగించి చెరువుకు దక్షిణం వైపున కొంత భాగాన్ని మట్టితో పూడ్చి ప్రభుత్వ పట్టాలను అందజేసి పక్కా ఇళ్లు నిర్మించనున్నట్లు, దీనికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హామీ ఇచ్చారన్నారు. పంచాయతీకి ఆదాయం చేకూరే విధంగా ఉత్తరం వైపు ఉన్న ప్రధాన రోడ్లో 15 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే యోచనలో కూడా క్లబ్ ఉందన్నారు. రోటరీ క్లబ్ కొయ్యలగూడెం శాఖ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తి చేసుకుని 26వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో చేపడుతున్న బృహత్కర ప్రాజెక్టుకు ప్రజలు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు.

ఘనంగా వాసవీ మాత జయంతి


జంగారెడ్డిగూడెంలో అమ్మవారికి పసుపు కుంకుమలను అందజేస్తున్న భక్తులు


ధర్మాజీగూడెంలో వాసవీ మాత సన్నిధిలో భక్తులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో శ్రీవాసవీమాత జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న వాసవీ మాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ చిన్ని సాయికుమార్ అమ్మవారికి చీర, జాకెట్, పసుపు, కుంకుమలు, గాజులు, పూలు అందజేశారు. వాసవీక్లబ్ గోల్డ్ ప్రెసిడెంట్ పులపర్తి సురేష్ 10 కేజీల పులిహోర వితరణ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ చిన్ని సాయికుమార్, వాసవీ క్లబ్ గోల్డ్ సీనియర్లు గుడిమెట్ల యుగంధర్, ఏలూరి ఫణికుమార్, సెక్రటరీ వందనపు మనోజ్‌కుమార్, నాగసూరి బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం : ధర్మాజీగూడెంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలను వాసవీ, వనిత క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక కుంకమ పూజలు చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి గంగాధరరావు, వనిత క్లబ్ అధ్యక్షులు కె పుష్పకుమారి, సమయమంతుల బలరామకృష్ణ, బోనగిరి ప్రకాశరావు, కేడీవీఎస్ సత్యన్నారాయణ, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. రెండు రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మంది కన్యలచే పూజలు, అదే విధంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన, కార్యక్రమాలు నిర్వహించగా, రెండవ రోజు కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పోలవరం మెయిన్ రోడ్‌లో కళాశాలతో ఆర్యవైశ్యులు ఊరేగింపు నిర్వహించారు.

పూర్ణ కళాశాలతో ఊరేగింపు

పోలవరం రూరల్ : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా ఆదివారం వాసవి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత పల్లకి, పూర్ణ కళాశాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వాసవి ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : బొర్రంపాలెంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 108 కలశాలతో తొలుత గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు చీరలు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు.


బొర్రంపాలెంలో 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు


కొయ్యలగూడెంలో విశేషాలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి

పేదల తరపున వైఎస్సార్ సీపీ పోరాటం


నాగులగూడెంలో బాధితులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి

జంగారెడ్డిగూడెం : పేదల తరపున వైఎస్సార్ సీపీ పోరాడుతుందని జెడ్పీటీసీ, ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి అన్నారు. నాగులగూడెంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇటీవల పేదలు నివాసం ఉంటున్న పుంత పోరంబోకు ప్రాంతాన్ని తనకు చెందినదిగా కోర్టు ద్వారా ఉత్తర్వులు తెచ్చుకుని ఓ భూస్వామి ఆక్రమించుకునేందుకు యత్నించాడు. ఈ క్రమంలో గత 30 ఏళ్లుగా 46 కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న పేదల ఇళ్లను తొలగించారు. దీంతో వారు నిర్వాసితులయ్యారు. తమకు న్యాయం చేయాలని నాగులగూడెంలో కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సూచన మేరకు నాగులగూడెంలో పుంత పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న బాధితులను బాబ్జి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు నివాసం ఉంటున్న భూమి పోరంబోకు అని, అది ప్రభుత్వానికి చెందినదన్నారు. దానిని ఆక్రమించే హక్కు ఎవరికీ లేదన్నారు. పేదల తరుపున వైఎస్సార్‌సీపీ కోర్టులో పోరాడుతుందని, పేదలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఇందుకు అవసరమైన ఖర్చులు కూడా వైఎస్సార్ సీపీ భరిస్తుందని ఆయన బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, గూడపాటి రాధాకృష్ణ, భాస్కర్ రెడ్డి, రామిరెడ్డి, దళిత నాయకుడు అమలపాల్ రాజు, నిట్టా బాలయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చదువుల్లో రాణించాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చదువుల్లో రాణించాలని సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి అన్నారు. పట్టెన్నపాలెం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆచార్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా చేపల పంపిణీ

ద్వారకాతిరుమల: మండలంలోని గొల్లగూడెంలో ఆదివారం ఆ గ్రామ సర్పంచ్ బొండాడ నాగభూషణం ఊరంతా చేపలను పంపిణీ చేశారు. గ్రామంలోని పంచాయతీ చెరువును లీజుకు తీసుకున్న ఆయన సేంద్రియ పద్ధతిలో చేపల పెంపకాన్ని చేపట్టారు. అలా పెంచిన చేపలను గతేడాది వలె ఈ ఏడు కూడా గ్రామంలోని ప్రతి ఇంటికీ రెండు చేపల చొప్పున ఉచితంగా అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని అన్ని ఇంటి పన్నులను ప్రతి ఏటా సర్పంచే కడుతున్నారు.

3 నుంచి ప్రథమ వార్షిక ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఫైర్ స్టేషన్ పక్కన కొలువైయున్న స్వయంభూ శ్రీపంచముఖ శ్వేతార్కహేరంభ గణపతి, శ్రీ చండీ సహిత మహాబలేశ్వర స్వామి వారి ప్రథమ వార్షిక ఉత్సవాలు మే 3వ తేదీ నుంచి 5వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్త, శైవాగమ శిరోమణి మామిళ్లపల్లి ఆనంద శివాచార్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మొదటిరోజు గణపతి మూలవిరాట్కు పంచామృత, విశేష ద్రవ్య అభిషేకం, గరిక పూజ, రెండవరోజు చండీమాతకు అభిషేకం అనంతరం లక్ష్మీ గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ, కాలభైరవ హోమాలు, సాయంత్రం 7 గంటల నుంచి చండీ మహాబలేశ్వర కళ్యాణం, మూడవరోజు శుక్రవారం ఉదయం 9.53 నిమిషాలకు కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మహాపూర్ణాహుతి సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : యువకుడి మృతిపై అతని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెం ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఎం.నాగమణికంఠ (20) ఇంటర్‌పూర్తి చేసి కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. ఏప్రిల్ 22వ తేదీ రాత్రి నాగమణికంఠ ఇంటికి వెళ్లిన సమయంలో తల్లిదండ్రులు కుటుంబ విషయమై తగవుపడుతుండగా, వారిని వారించి, కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం స్థానిక కొమారదేవి గుడి వద్ద ఉన్న బజ్జీల బండి అద్దాన్ని కోపంతో కుడి చేతితో గుద్దాడు. ఈ ఘటనలో అద్దం గుచ్చుకుని కుడిచేతికి తీవ్ర గాయ కావడంతో వెంటనే మణికంఠను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ ఆసుపత్రికి తరలించారు. విజయవాడలో చికిత్స పొందుతూ ఈనెల 29వ తేదీ రాత్రి మృతిచెందాడని, ఆ మేరకు మృతుడి తండ్రి ఎం.గౌరీనాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

చింతలపూడి : ఇంటర్మీడియెట్ విద్యా మండలి కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి స్కైలాబ్ ఆదివారం తెలిపారు. మే 1 నుంచి 24 వరకు తరగతులు జరుగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు మే 1 నుంచి 20 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే అలీముద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు.